గురుకులాల తరహాలో సర్కారు బడులు

- హెచ్ఎండిఏ, మున్సిపాలిటీల్లో కొత్త పాఠశాలలను ప్రారంభించాలి
- మౌలిక వసతుల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదు
- పిల్లల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

విద్యాశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలను ప్రారంభిస్తున్నామని సిఎం వెల్లడించారు. నాణ్యమైన భోజనం, యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని, సర్కారు బడుల్లోని విద్యార్థులకూ (డే స్కాలర్లకూ) ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పున్ణ ప్రారంభమైన నేపథ్యంలో ఐసిసిసిలో విద్యాశాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ క్రమంలో బోధన ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతోపాటు నైపుణాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని కోరారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశముంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకుని హెచ్ఎండిఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సి, ఎస్‌టి, బిసి మైనార్టీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలంటూ అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతోపాటు కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సిలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతోపాటు బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ప్రజలను ఊహల్లో విహరింపచేస్తున్న మోడీ ప్రభుత్వం

- విద్యా, వైద్యం, సమానత్వ పాలన అందించడంలో పూర్తిగా విఫలం : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను ఊహల్లో విహరింప చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యా, వైద్యం, సమానత్వ పాలన అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎట్లా గురువారెడ్డి విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని ప్రధాని మోడీ చెబుతున్నారని.. అవి అసంబద్ధమైన మాటలే తప్పా వాస్తవిక ఆధారాలు లేవన్నారు. కమ్యూనిస్టులను, మావోయిస్టులను అణచివేయడానికి చూస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. మావోయిస్టులపై కొనసాగుతున్న ధమనకాండను విరమించుకొని వారిని చర్చలకు ఆహ్వానించాలని కోరారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దురదృష్టకరమని.. దానిపై తగిన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యే సందర్భంలో కెసిఆర్, హరీశ్‌రావు.. హంగు ఆర్భాటాలతో, జనబలంతో హాజరు కావడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం డిజైన్ తానే చేశానని చెబుతుండే కెసిఆర్.. ఇప్పుడు తనకేమీ తెలియదనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నిజా నిజాలు ఏమిటో కమిషన్ తేలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పారదర్శకంగా కొనసాగాలని, తమ పార్టీ పథకాలుగా మార్చొద్దని తెలిపారు. సిపిఐ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో డిసెంబర్ 26వ తేదీన 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్, ఆరీఫ్, సత్యనారాయణ, మల్లేశం, చంద్రం, ప్రసన్నకుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

193 మెడికల్ షాపులకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాంటి బయాటిక్స్ ఔషధాల అమ్మకంలో నిబంధనలు ఉల్లంఘించిన 193 మెడికల్ షాపులకు డ్రగ్ కంట్రోల్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్)ను నియంత్రించేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం, అమ్మిన బిల్లును ఇవ్వకపోవడం, రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్ లేకపోవడం, షెడ్యూల్ హెచ్ 1 డ్రగ్ రిజిస్టర్‌ను నిర్వహించకపోవడం, ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్స్ లేకపోవడం వంటి లోపాలను డ్రగ్ ఇన్ స్పెక్టర్లు గుర్తించారు. ఈ మెడికల్ షాపులపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్, 1940 నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

దోస్త్ రెండోవిడతలో 43,568 మందికి సీట్ల కేటాయింపు

- 18 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు
- 19 వరకు మూడో విడత రిజిస్ట్రేషన్లు, ఆప్షన్ల నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యు, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రెండో విడత సీట్లను ఉన్నత విద్యామండలి కేటాయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ రెండో విడతకు 46,883 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. వారిలో 43,568 మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. మొదటి విడతలో సీట్లు పొందిన వారిలో రెండో విడతలో మెరుగైన కాలేజీ, కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లను చేశారనీ, 6,077 మందికి కేటాయించామని వివరించారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 3,315 మందికి సీట్లు కేటాయించలేదని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ద్వారా సీట్లు పొందిన అభ్యర్థులు 30,973 మంది ఉన్నారని పేర్కొన్నారు. రెండు, ఇతర ప్రాధాన్యతల ఆధారంగా 12,595 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. కామర్స్‌లో 13,900 మంది, ఫిజికల్ సైన్సెస్‌లో 11,277 మంది, లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు)లో 8,821 మంది, ఆర్ట్స్‌లో 5,032 మంది, ఇతర కోర్సుల్లో 4,538 మంది కలిపి మొత్తం 43,568 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీటును రిజర్వు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈ నెల 18 వరకు ఉందని తెలిపారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌తోపాటు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదుకు తుది గడువు ఈనెల 19 వరకు ఉందని తెలిపారు. ఈనెల 23న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్

- రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రండి
- 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షేమం, అభివృద్ధి విషయాల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న నేపథ్యంలో తమ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పలు దేశాల ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హోటల్‌లో 'ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్(ఐబీసీ)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్ - 2025'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదట్లో చాలా మంది తెలంగాణ అభివృద్ధి అసాధ్యమన్నారని గుర్తు చేశారు. కానీ.. అనతి కాలంలోనే రాష్ట్రం అన్ స్టాపబుల్ అనే స్థాయికి ఎదిగిందని వివరించారు. రాష్ట్ర జీడీపీ 16.12 లక్షల కోట్లకు చేరిందన్నారు. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9శాతం)ను దాటేసిందని తెలిపారు. తలసరి ఆదాయం 3.79 లక్షలుందనీ, ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువని చెప్పారు. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగామని వివరించారు. గత 14 నెలల్లో లైఫ్ సైన్సెస్‌లో రూ.40వేల కోట్ల పెట్టుబడులను సాధించామని వివరించారు. రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించామని తెలిపారు. రాష్ట్ర జీడీపీలో సేవల రంగం వాటా 66.3 శాతం కాగా, దేశంలో ఇది 55 శాతంగా ఉందన్నారు. ఇవి అంకెలు కాదనీ,... తెలంగాణ పురోగతికి నిదర్శనాలు' అని స్పష్టం చేశారు. 'ప్రతి భాగస్వామ్యం ఒక లావాదేవీ కాదు.. అది ఒక మార్పు అవుతుంది'అని చెప్పారు. అందుకే అంతర్జాతీయ భాగస్వామ్యాలతో తెలంగాణ పురోగతిని మరో అడుగు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఆగ్రో ఇన్నోవేషన్, ఏఐ గవర్నెన్స్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ ఫార్మింగ్, ఫ్యూచర్ - రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, క్లీన్ ఎనర్జీ తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కేవలం పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే ఇక్కడకు రావొద్దు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు కలిసి రావాలని ఆహ్వానించారు. 'బ్రెజిల్, జర్మనీ, రష్యా, కామెరూన్, మాల్టా, యూకే, బల్గేరియా, బెల్జియం, యూఏఈ, దుబాయి తదితర 25 దేశాల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం శుభపరిణామన్నారు. ఇది ఒక సదస్సుగా మిగిలిపోకుండా వివిధ దేశాల మధ్య సంస్కృతి, వ్యూహాలు, టెక్నాలజీ బదలాయింపునకు వారధిగా నిలవాలని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సహకాలను ఆయా దేశాల్లోని పారిశ్రామికవేత్తలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ డిప్లొమేటిక్ రిలేషన్స్(ఐవోడీఆర్) మాల్టా గవర్నర్ లిల్లో మత్రా, కార్యదర్శి మార్సెల్లో పట్టి, బెల్జియం ఎంపీ ఇవాన్ పెట్రోవ్, జర్మనీ డిప్లొమాట్ డానియల్ జెర్బిన్, అర్జెంటీనా ఎంపీ క్లాడియో సింగోలనీ, ఐబీసీ చైర్మెన్ సాల్మన్ గట్టు, డైరెక్టర్ గ్లోరియా సుహాసిని పాల్గొన్నారు.

అభయారణ్యంను సందర్శిస్తున్న ట్రైనీ అధికారులు

అభయారణ్యంలో ట్రైనీ ఐఎఎస్ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ అభయారణ్యాన్ని ట్రైనీ ఐఎఎస్ అధికారులు సందర్శించారు. 2024 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ట్రైనీ అధికారులు తెలంగాణ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కవ్వాల్ టైగర్ జోన్ పరిధి జన్నారం అటవీ డివిజన్‌లోని గొండుగూడ, బైసన్ కుంట తదితర ప్రాంతాలను సందర్శించారు. రెండ్రోజులపాటు అభయారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించనున్నట్టు జిల్లా అధికారులు తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎఫ్‌ఆర్ఓ సుష్మారావు తెలిపారు.

నేటినుంచి ఈసెట్ కౌన్సెలింగ్

- 17 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. అదేనెల 17 నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అదేనెల 17 నుంచి 21 వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈనెల 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. 25 నుంచి 29 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వచ్చే ఐద్రోజులు వర్షాలు

- 21 జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- శుక్రవారం 220కిపైగా ప్రాంతాల్లో వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు, పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు 21 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. శనివారం నాడు నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ భారీ వర్షం కురిసే సూచనలున్నాయని తెలిపారు. ఆది, సోమ, మంగళ వారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయి. రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 220కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగులో అత్యధికంగా 7.85 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోనూ 6.67 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది. వనపర్తి, సూర్యాపేట, మెదక్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, ఖమ్మం, జగిత్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగాన్ని కాపాడాలి

- అభ్యర్థుల ఎంపికలో 'టిపిఎస్‌సి' స్థిరంగా ఉండాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగ విలువలను కాపాడాలని, ప్రజా సేవ కోసం అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతలో స్థిరంగా ఉండాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ సహకారంతో ఈ నెల 12, 13 తేదీల్లో శామీర్‌పేటలోని నల్సార్ క్యాంపస్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల (పిఎస్‌సి)లో చట్టపరమైన సమస్యలు, తగ్గింపుపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించింది. శుక్రవారం కీలక ఇతివృత్తాలపై ఆకర్షణీయమైన, ఆలోచింపజేసే ప్యానెల్ చర్చలు జరిగాయి. ముఖ్యంగా వ్యాజ్యం, ఉపశమన వ్యూహాల్లో వాటాదారులు, ఉత్తమ పద్ధతులు, భవిష్యత్ దిశలు, చట్టపరమైన సమస్యలను పరిష్కరించడంలో సాంకేతికత పాత్రపై చర్చలు జరిగాయి. రెండో రోజు ముగింపు సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. రాష్ట్ర 'పిఎస్‌సి'ల చైర్మన్ల మధ్య ఇంత ముఖ్యమైన సంభాషణను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకున్నందుకు 'టిజిపిఎస్‌సి'ని ప్రశంసించారు. వ్యూహాత్మక ఉపశమన చర్యలను అమలు చేస్తున్నప్పుడు సానుభూతి, మానవ కేంద్రీకృత పాలన ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం టీజీపీఎస్‌సీ చైర్మెన్ 'పీఎస్‌సీ'కి సంబంధించిన కేసు చట్టాలు, తీర్పుల కేంద్రీకృత డిజిటల్ రిపోజిటరీని సృష్టించడం ప్రాముఖ్యతను వివరించారు. అన్ని రాష్ట్ర 'సిఎస్‌సి'లకు అందుబాటులో ఉన్న ఈ రిపోజిటరీ, చట్టపరమైన పూర్వాపరాలను సబ్జెక్టుల వారీగా ప్రస్తావించడానికి, వ్యాజ్యాలను బాగా అర్థం చేసుకోవడానికి, నిర్వహించడానికి సహాయపడుతుందని తెలిపారు. కమిషన్లలో ముఖ్యమైన తీర్పులు, చట్టపరమైన నవీకరణలను క్రమం తప్పకుండా ప్రచురించడానికి, పంపిణీ చేయడానికి 'పిఎస్‌సి'ల కోసం ప్రత్యేక లీగల్ జర్నల్‌ను ప్రారంభించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎస్‌సీ చైర్మెన్ ఎస్.శివశంకరప్ప సాహుకర్, యూపీఎస్సీ జాయింట్ సెక్రెటరీ సంతోష్ గోపాల్ అజ్మీరా, ఫెలో, ప్రోగ్రామ్ డైరెక్టర్ బి.సూర్య ప్రకాష్, బెంగళూరు చైర్‌పర్సన్ దాక్ష, గోవా చైర్మన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌సింహ, వెబ్‌న్యాయ్ సిఇఒ విశ్వం జిందాల్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు, గుజరాత్ చైర్మెన్ నాగార్జున హస్ముఖ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చింతల్ బస్తీలో ధ్వంసమైన పైప్‌లైన్ పునరుద్ధరణ

- పనులను పరిశీలించిన జలమండలి ఎండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చింతల్‌బస్తీ వద్ద ధ్వంసమైన 300 ఎంఎం డయా పైప్‌లైన్ అత్యవసర మరమ్మతుల పనులను జలమండలి ఎండి అశోక్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. స్థానికులకు నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా వెంటనే మరమ్మతు పనులు పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరణ చేయాలని సూచించారు. అలాగే, కొత్తగా నిర్మించిన పైప్‌లైన్‌ను బలోపేతం చేయడానికి సరైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గురువారం సాయంత్రం హైడ్రా చేపట్టిన నాలా ఆక్రమణ తొలగింపు సమయంలో బంజారాహిల్స్ సంప్ ఔట్‌లెట్ నుంచి మసాబ్ ట్యాంక్, ఎసి గార్డ్స్‌కు తాగునీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతింది. వెంటనే స్పందించిన జలమండలి అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. ఆ పనులు శుక్రవారం 2 గంటల వరకు పూర్తి చేశారు. ఆ తర్వాత నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఎసి గార్డ్స్, చింతల్‌బస్తీ, మసాబ్ ట్యాంక్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా కొనసాగింది.

డిప్యూటీ సిఎంను కలిసిన నవీన్ మిట్టల్

డిప్యూటీ సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నవీన్ మిట్టల్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం ప్రజాభవన్‌లోని డిప్యూటీ సీఎం నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నవీన్‌మిట్టల్‌ను అభినందించారు. సమర్థవంతమైన సేవల్ని అందించాలని ఆకాంక్షించారు. దీనికి ప్రతిస్పందనగా శక్తివంచన లేకుండా విద్యుత్‌రంగ అభివృద్ధికి కృషి చేస్తానని నవీన్‌మిట్టల్ హామీ ఇచ్చారు.

సిగ్నల్ కోసం.. బిఎస్ఎన్ఎల్ నుంచి ఎయిర్‌టెల్‌కు..?

- నెట్‌వర్క్ ఇష్యూతో ప్రయివేటు టెలికాం కంపెనీకి మారిన ప్రభుత్వ విద్యుత్‌సంస్థ
- విద్యుత్ ఉద్యోగులకు కొత్త ఫోన్ నెంబర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్ఎన్ఎల్.. ప్రభుత్వ టెలికాం సంస్థ. 'కనెక్టింగ్ ఇండియా' అంటూ మారుమూల ప్రాంతాల్లో సైతం టెలీ, ఇంటర్నెట్ సేవలు అందిస్తూ తనదైన ముద్ర వేసుకుంటూ వచ్చింది. కాగా ప్రయివేటు టెలికాం కంపెనీలను అందలం ఎక్కిస్తూ వచ్చిన పాలకుల తీరుతో బిఎస్ఎన్ఎల్ క్రమంగా తన ప్రభావం కోల్పోతున్న విషయం తెలిసిందే. గతంలో ప్రయివేటు వినియోగదారులు క్రమంగా దూరమవుతూ వస్తుండగా.. తాజాగా ప్రభుత్వ సంస్థలు సైతం బీఎస్ఎన్ఎల్‌కు దూరమవుతున్నాయి.

టిజిఎన్‌పిడిసిఎల్ సంస్థ.. తమ ఉద్యోగులకు, కార్యాలయాలకు బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డులు కేటాయించింది. సిగ్నల్ సమస్య వల్ల పనులు చేయలేకపోతున్నామని, సమాచారం అందించలేకపోతున్నామని పై నుంచి కిందిస్థాయి ఉద్యోగులు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దాంతో కొత్తగా ఎయిర్‌టెల్ సిమ్‌లను తమ సంస్థ కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ కలవకపోవడంతో విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కమ్యూనికేషన్ చేసే అవకాశం లేకపోవడంతో ఇక్కట్లు పడినట్టు సమాచారం. దాంతో ఎయిర్‌టెల్‌కు తమ ఫోన్ నెంబర్లను మార్చారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో అధికారుల ఫోన్ నెంబర్లు మారాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయి ఎస్ఈ నుంచి ఏడీఈ, ఏఈ తదితరుల అధికారులకు, కార్యాలయాలకు కొత్తగా ఎయిర్‌టెల్ సిమ్‌కార్డులు కేటాయించారు. మొత్తంగా 623 మంది అధికారుల, కార్యాలయాల ఫోన్ నెంబర్లు మారాయి.

ఫోన్ సిగ్నల్‌లో సమస్యలు

జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్ రవీందర్

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఉపయోగించే అన్ని అధికారిక మొబైల్ నెంబర్లు మారాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న నెట్‌వర్క్ వల్ల సిగ్నల్ సమస్యలు వస్తుండటంతో కొత్తగా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లోకి మారాయి. దాంతో జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్‌శాఖల అధికారులవి, జిల్లా కంట్రోల్ రూమ్ ఆఫీస్‌లో వినియోగించే అన్ని మొబైల్ నెంబర్లు మారాయి.

ఆర్‌టిసిలో ఒకే జెఎసి ఏర్పాటు చేద్దాం

- ఎస్‌వికెలో భేటీ అయిన కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి)లో అన్ని కార్మిక సంఘాలతో కలిపి ఒకే జెఎసిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానిలో భాగంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్మిక సంఘాల నాయకులు భేటీ అయ్యారు. ఈదురు వెంకన్న (ఈయూ) చైర్మన్‌గా ఉన్న జెఎసి, ఇ అశ్వత్థామరెడ్డి (టిఎమ్‌యు) చైర్మన్‌గా ఉన్న జెఎసి, టిజిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు తదితర సంఘాల నేతల ఈ సమావేశంలో పాల్గొన్నారు. అశ్వత్థామరెడ్డి జెఎసి ప్రతినిధులుగా టిఎంయు నాయకులు రాజలింగం, ఎన్ఎమ్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి కమాల్‌రెడ్డి హాజరయ్యారు. కె హన్మంతు ముదిరాజ్ (టిజెఎమ్‌యు), ఎమ్ థామస్‌రెడ్డి (టిఎమ్‌యు), ఎమ్‌డి మౌలానా (ఎన్ఎమ్‌యు), కత్తుల యాదయ్య (బికెయు), సుద్దాల సురేష్ (బిడబ్ల్యుయు), బి యాదగిరి (కార్మిక పరిషత్) హాజరయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్‌టిసిలోని అన్ని కార్మిక సంఘాలు ఒకేతాటిపైకి రావాలనీ, ఉమ్మడి అజెండాతో పని చేయాలని నిర్ణయించారు. అన్ని సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్మికులు కూడా సంఘాల మధ్య ఐక్యతను కోరుకుంటున్నారనే విషయం చర్చకు వచ్చింది. సమావేశానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి), బిఎమ్ఎస్, ఎస్‌టిఎమ్‌యు సంఘాల ప్రతినిధులు హాజరు కానందున ఈ నెల 24న మరోసారి ఉమ్మడి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సింగిల్ జెఎసిగా ఏర్పాటయ్యాక ఉమ్మడి అజెండాతో భవిష్యత్ పోరాటాలు నిర్వహించాలని ఆయా సంఘాల నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు 3.64 శాతం డిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఉద్యోగులకు 3.64 శాతం డిఎ పెంచింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డిఎ 2023 జనవరి 1 నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒక డిఎ ఇచ్చిన ప్రభుత్వం ఆరు నెలల తర్వాత మరో డిఎను ఇవ్వనున్నది.

18 నుంచి సిపిగెట్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ (సిపిగెట్) నోటిఫికేషన్‌ను శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఓయూ వైస్ ఛాన్సలర్ ఎం కుమార్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి సిపిగెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల 17 వరకు ఉందని అన్నారు. ఆలస్య రుసుం రూ.500తో అదే నెల 24 వరకు, రూ.రెండు వేలతో 28 వరకు సమర్పించేందుకు అవకాశముందని వివరించారు. సిపిగెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రంలో పీజీ కోర్సులు, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు కలిపి 108 ఉన్నాయనీ, 51 సబ్జెక్టులకు రాతపరీక్షలుంటాయని అన్నారు. 297 కాలేజీల్లో గతేడాది 46,742 సీట్లున్నాయనీ, వాటిలో 21,560 భర్తీ అయ్యాయని వివరించారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఈడబ్ల్యుఎస్ కింద నాలుగు వేల సీట్లు పెరిగే అవకాశముందన్నారు. దీంతో 50,742 పీజీ సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.వివరాల కోసం www.osmania.ac.in, https://cpget.tgche.ac.in, www.ouadmissions.com వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించారు.

పల్లాను పరామర్శించిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలికి గాయంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం సిరిసిల్ల ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం బాగానే కోలుకుంటున్నట్లు పల్లా తెలిపారు. వేగంగా కోలుకుని, త్వరలోనే తిరిగి ప్రజాక్షేత్రంలో యథావిధిగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కెటిఆర్ వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

కెటిఆర్‌కు నోటీసుల జారీ కవిత ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ కక్షసాధింపులో భాగంగా తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు కాంగ్రెస్ సర్కార్ మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ట్వీట్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని ఆమె హెచ్చరించారు.

రాజకీయ కక్షసాధింపుతోనే నోటీసులు

- హరీశ్ రావు ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్ములా ఈ కార్ల రేసింగ్ తో రాష్ట్ర ప్రతిష్ట పెరిగి, పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నోటీసులు జారీ చేయించిందని ఆరోపించారు. ఎన్ని రకాలుగా వేధించినా ఆ వైఫల్యాలను ఎండగట్టడం బీఆర్‌ఎస్ ఆపదని హరీశ్ రావు హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజాపాలన

- మూడున్నరేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- భూభారతితో భూ సమస్యల పరిష్కారం
- మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజా పాలన ముందుకు సాగుతుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్‌ను రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్ సింగ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావుతో కలిసి శుక్రవారం మంత్రులు ప్రారంభించారు. అలాగే జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ పాలనలో జిల్లాలో పట్టపగలే న్యాయవాద దంపతులను నరికి చంపిన నాయకులను కేసుల నుంచి తప్పించేందుకే 'ఫ్రెండ్లీ పోలీస్' పని చేసిందని విమర్శించారు. ప్రస్తుతం సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా.. శాంతి భద్రతలను పరిరక్షించేలా పోలీస్ వ్యవస్థ పని చేస్తోందన్నారు. ఫిర్యాదులు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమస్యలను పరిష్కరించి వారి అభిమానాన్ని పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలను, వసతులను ప్రజా ప్రభుత్వం మెరుగు పర్చిందన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సతీమణి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకుని ప్రజల్లో చైతన్యం కల్పించినందుకు జిల్లా కలెక్టర్‌ను మంత్రి అభినందించారు. ఎలిగేడు మండల ప్రజల కోసం రాబోయే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజయ రమణారావు కోరగా, అందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలకులు విచ్చిన్నం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. గత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే నూతనంగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ధరణి చట్టం వల్ల కేవలం ఒకే కుటుంబ సభ్యులు మాత్రమే లబ్ధి పొందారని, అనేక మంది రైతులకు కన్నీళ్లు మిగిల్చిన ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేశామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అద్భుతమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. రానున్న మూడున్నర ఏళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ప్రతి పేదవారికీ ఇల్లు ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మెన్ నరేందర్‌రెడ్డి, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జె.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధనుకా నుంచి కొత్త కలుపునాశిని దినకర్

ప్రజాశక్తి - హైదరాబాద్

వ్యవసాయ రసాయన ఉత్పత్తుల కంపెనీ ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్ సరికొత్త కలుపు నివారిణి 'దినకర్'ను ఆవిష్కరించింది. వరి కోసం ప్రత్యేకంగా రూపొందించిన తర్వాతి తరం కలుపునాశిని అని ఆ సంస్థ పేర్కొంది. రైతులకు అత్యాధునిక, స్థిరమైన పంట సంరక్షణ పరిష్కారాలను అందించడంలో ఇది తమ కంపెనీ నిబద్ధతకు ఒక ముఖ్యమైన మైలురాయిని అని ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్ ప్రెసిడెంట్ పవన్ సరోగి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హోక్కో కెమికల్ ఇండస్ట్రీ కో.లిమిటెడ్, జపాన్‌కు చెందిన అంతర్జాతీయ విక్రయ విభాగం మేనేజర్ కోచి ఒగిటా, ధనుక ప్రతినిధులు సునీల్ కుమార్, ఎం పరశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

- కమిషనర్ సి హరి కిరణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్యూరోబార్ల డ్రా ప్రశాంతంగా ముగిసింది. లబ్ధిదారులను కమిషనర్ సి హరి కిరణ్ స్వయంగా కలిశారు. 28 బార్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శంగా జరిగినట్టు ఆయన వెల్లడించారు. బార్ల దరఖాస్తు దారుల సమక్షంలో ప్రశాంతంగా డ్రా ప్రక్రియ ముగిసిందని, ఈ కార్యక్రమానికి సహకరించిన దరఖాస్తుదారులకు, ఎక్సైజ్ అధికారులందరికీ ధన్యవాదాలు, డ్రాలో గెలుపొందిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గోల్కొండ, నార్సింగ్ ప్రాంతంలో ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో జిహెచ్‌ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో కమిషనర్ డ్రా తీశారు. డ్రా బాక్స్ లోని కమిషనర్ కాయిన్స్ తీసి ఇవ్వగా జాయింట్ కమిషనర్ హెడ్ క్వార్టర్స్ కెఎబి శాస్త్రి నెంబర్ దరఖాస్తుదారుల సమక్షంలో వెల్లడించారు. డ్రాలో బార్ షాప్ గెలుపొందిన లబ్ధిదారులు లబ్ధిదారులు అలాట్మెంట్ లెటర్ ని తీసుకొని వెళ్లాలని కమిషనర్ ప్రతి ఒక్కరిని కలిసి చెప్పారు. 90 రోజుల్లోగా బార్ల ప్రక్రియను పూర్తి చేసుకుని నడిపించుకోవాల్సిందిగా కోరారు. నిజామాబాద్ మహబూబ్‌నగర్ జాల్ పల్లి ప్రాంతాల్లోనూ ప్రశాంతంగా ముగిసిందని కమీషనర్ వెల్లడించారు. డ్రాకు ముందు అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిచన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

సర్వియర్ ఇండియా ఓరల్ క్యాన్సర్ థెరపీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ ఫ్రెంచ్ ఫార్మాస్యూటికల్ సర్వియర్ గ్రూప్ అనుబంధ సంస్థ సర్వియర్ ఇండియా అక్యూట్ మైలోయిడ్ లుకేమియా చోలాంగియోకార్సినోమా ఉన్న క్యాన్సర్ రోగుల నిర్వహణలో నూతన థెరపీని అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది ఐసోసిట్రేట్ డీహైడ్రోజినేస్-1 మ్యుటేషన్‌తో ఆమోదించబడిన ఓరల్ టార్గెటెడ్ థెరపీ అని తెలిపింది. దీనికి సంబంధించిన మందుల దిగుమతి, అమ్మకం, పంపిణీ కోసం సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి ఈ ఏడాది మే 14న సర్వియర్ ఇండియా ఆమోదం పొందినట్టు తెలిపింది. ఈ సందర్భంగా సర్వియర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరేలియన్ బ్రైటన్ మాట్లాడుతూ క్యాన్సర్ సంరక్షణలో అంతరాలను తొలగించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ క్యాన్సర్ సంరక్షణను ముందుకు తీసుకుపోవడంలో ఉపయోగపడుతుందని మెడికల్ అండ్ పేషెంట్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రణవ్ సోపోరి ఆశాభావం వ్యక్తం చేశారు.

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

- రైతులకు జిల్లా కలెక్టర్ కోడెల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పంపిణీ చేస్తున్న కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపూర్‌లోని గోశాలలో శుక్రవారం 50జతల కోడెలను(100కోడెలు) రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటివరకు మొత్తం 375జతల(750కోడెలు) పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధాకష్ణారెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పేర్లను నమోదు చేసుకుంటున్న రైతులు

ఎమ్మెల్యేపై బస్తీవాసుల ఆగ్రహం

- నాలా పనులపై నిలదీత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తోపాటు అతని అనుచరులపై బస్తీవాసులు తిరగబడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మౌలాకా చిల్లా ప్రాంతంలో నాలా పనులు పెండింగ్‌లో ఉండటంతో తమ ఇండ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని గతంలో ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదులు చేశారు. అయితే, వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనలో భాగంగా గురువారం మౌలాకాచిల్లా ప్రాంతంలో నాలా పనులను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ పరిశీలించారు. ఆ సమయంలో నాలా పనులపై ఎమ్మెల్యేను స్థానికులు నిలదీశారు. వర్షాకాలం వచ్చినా నాలా పనులు పూర్తి చేయించలేని, ఎమ్మెల్యే ఉండి ఎందుకని ప్రశ్నించారు. దాంతో ఎమ్మెల్యేనే ఎదురిస్తారా అంటూ అనుచరులు స్థానికులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అనుచరులపై స్థానికులు తిరగబడ్డారు. తోపులాట జరిగింది. తమ సమస్యలపై ఎమ్మెల్యేని ప్రశ్నిస్తే, అనుచరులతో దాడి చేయిస్తారా అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తిరుగుబాటుతో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, అతని అనుచరులు అక్కడి నుంచి వెళ్లిపోయారు

ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జనరల్ చెకప్ కోసం శుక్రవారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చారు. రెగ్యూలర్ చెకప్‌లో భాగంగా కేసీఆర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇదిలా ఉంటే బుధవారం కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరైనప్పుడు ఆయన స్వల్ప అస్వస్థతకు గురైనట్టు వార్తలు వినిపించాయి. అనంతరం రెండు రోజులకే ఆస్పత్రికి రావడం కేసీఆర్ ఆరోగ్యంపై కొంత ఆందోళన కలిగిస్తోంది. అయితే సాధారణ వైద్య పరీక్షల కోసం కేసీఆర్ తరుచుగా తమ హాస్పిటల్‌కు వస్తారని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. వైద్య పరీక్షల అనంతరం కేసీఆర్ తిరిగి ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఉన్నారు

ఈ ఫార్ములా రేస్ కేసులో

లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం

- ఓటుకు నోటు కేసులో అదే పరీక్షకు నువ్వు సిద్ధమా?
- సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎసిబి పరిధిలో తనతో పాటు సిఎం రేవంత్ రెడ్డిపై కూడా కేసు కూడా పెండింగ్‌లో ఉందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గుర్తుచేశారు. పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్ల బ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఏసీబీ పరిధిలోనే ఉందని తెలిపారు. ఇద్దరిపై కూడా ఎసిబి కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇందు కోసం జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు కెటిఆర్ ప్రకటించారు. అదే పరీక్షకు ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా? అని కెటిఆర్ సవాల్ విసిరారు. ఈ పరీక్ష ద్వారా అసలు నేరస్తులెవరో తెలుసుకునే అవకాశం ప్రజలకు ఇవ్వాలని కోరారు. ఇందుకోసం సిఎం రేవంత్ రెడ్డి వెంటనే టెస్టుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఫార్ములా-ఈ అంశంలో నోటీసుల డ్రామా ఆపాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్ని నోటీసులిచ్చినా జోకర్ సీఎం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. ప్రజల దృష్టి మరల్చే కుటిల ప్రయత్నాలతోనే నోటీసులని తెలిపారు. ప్రజల గొంతుకై పోరాడుతున్న తమను వైఫల్యాల కాంగ్రెస్, దద్దమ్మ సిఎం అడ్డుకోలేరన్నారు. పూటకో వేషం, రోజుకో కుట్ర, చిల్లర చేష్టలు, పనికిరాని డ్రామాలని నోటీసుల వ్యవహారాన్ని కొట్టిపారేశారు.

ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హెచ్‌ఎండిఏ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి పారదర్శకంగా, సాధికారికంగా పంపిన రూ.44 కోట్లు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్‌లోనే ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. వాటిని వెనక్కి రప్పించడం సిఎం రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు. గొప్ప పేరు తీసుకొచ్చిన ఫార్ములా ఈ రేసును రాజకీయ దురుద్దేశంతో రద్దు చేసి, ఆ సంస్థ వద్ద ఉన్న ప్రజాధనాన్ని ఉద్దేశపూర్వకంగా వెనక్కి తీసుకురాకుండా నోటీసుల పేరుతో కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఎసిబి నోటీసు జారీ చేసిందనీ, చట్టాలను గౌరవించే పౌరునిగా, సోమవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరై సహకరిస్తానని స్పష్టం చేశారు.

నగరంలో మరో ఫెర్నాండెజ్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

మహిళలకు ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరించడంలో భాగంగా ఫెర్నాండెజ్ హాస్పిటల్ బోగులకుంటలో నూతన అవుట్‌పేషెంట్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ క్లినిక్ ఫెర్నాండెజ్ హాస్పిటల్ ప్రధాన ఆసుపత్రికి సమీపంలోనే ఉందని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ఎండి డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ తెలిపారు. ఇక్కడ మహిళలు, శిశువులు, చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలను అందించనున్నామన్నారు. ఈ కొత్త క్లినిక్‌లో అన్ని ప్రత్యేక అవుట్‌పేషెంట్ సౌకర్యాలు ఒకే చోట లభిస్తాయన్నారు. నియోనాటాలజీ, పీడియాట్రిక్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. నవజాత శిశువులు, పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించడం, వారి ఎదుగుదల పర్యవేక్షణ, నిపుణుల మార్గదర్శకత్వంలో టీకాలు వేయడంతోపాటు తదితర సేవలు లభిస్తాయన్నారు.

టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలి

- సిజిఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఆషాఢ బోనాలను ఈసారి ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. దేవాలయాల అభివృద్ధికి సిజిఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయ శాఖ సీజీఎఫ్ కమిటీ సమావేశం జరిగింది. అందులో మంత్రితో పాటు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఉన్నతాధికారులు, ఈఓలు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బడ్జెట్ అనుమతులు, సీజీఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. రూ. 72.47 కోట్ల విలువైన 297 పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... సీజీఎఫ్ పనులపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల సూచనలనే పంపకుండా క్షేత్ర స్థాయిలో ఈఓలు పరిశీలించి, సరైన అంచనాలు వేయాలని సూచించారు. చిన్న చిన్న ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్లపై మరింత కసరత్తు చేయాలని సూచించారు. ఒక జిల్లాలోని మూడు ప్రధాన ఆలయాలను కలిపి సర్క్యూట్‌గా ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్లాలన్నారు. ప్రముఖ ఆలయాలకు భక్తులు, పర్యాటకులను రప్పించడంతో పాటు మార్గమధ్యంలో ఉన్న సందర్శక ప్రాంతాలు తిలకించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

పని చేస్తేనే పదవులు

డిసిసి అధ్యక్షులు, సంస్థాగత నిర్మాణం పరిశీలకులకు మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంట్లో కూర్చుని పదవుల కోసమే తామున్నామన్నట్టు వ్యవహరించే వారి ఆశలు నెరవేరవని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎఐసిసి ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్ నుంచి డిసిసి అధ్యక్షులతో, రాష్ట్ర సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆమె మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. అదే సమయంలో పని చేసే వారికి పదవులు వరిస్తాయనీ, అందులోనూ సామాజిక న్యాయం అమలవుతుందని స్పష్టం చేశారు. పని చేయకుండా పదవులు కోరుకునే వారికి ఆశాభంగం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండల, జిల్లా కమిటీల నియామకంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్‌లో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. సామాజిక న్యాయాన్ని కాపాడుతూ పార్టీలో, ప్రభుత్వంలో పదవుల పంపిణీ చేస్తున్నదని తేల్చిచెప్పారు. పదవులను పంపిణీ చేసిన విధానాన్ని వివరించారు. సమాజంలో ఎవరి వాటా వారికి ఇవ్వాలన్న సిద్ధాంతంతో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పని చేస్తున్నారని తెలిపారు. ఆయన సిద్ధాంతాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆ సిద్ధాంతాల అమల్లో భాగంగా ఇప్పటి వరకు ఇచ్చిన పదవులన్నింటిలో సామాజిక న్యాయాన్ని పాటించినట్టు స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటుందన్నారు. పార్టీలో పని చేసిన వారందరికీ పదవులొస్తాయని తెలిపారు.

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వస్తున్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. చిత్తశుద్ధితో పని చేసిన వారందర్నీ పార్టీ వారి వారి స్థాయిలలో తప్పకుండా గుర్తిస్తుందని తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణలో పెద్దఎత్తున అన్ని రాష్ట్రాల కంటే బాగా చేశామని ఆయన గుర్తుచేశారు. ఎఐసిసి అగ్రనేతలు కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు చెప్పడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. సంస్థాగత నిర్మాణం కూడా తెలంగాణలోనే బాగా జరుగుతున్నదనీ, రాష్ట్ర పరిశీలకులు, కో ఆర్డినేటర్లు బాగా పని చేస్తున్నారని తెలిపారు. మండల, జిల్లా స్థాయి కమిటీల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించేదెవరు..?

- సంక్షేమ హాస్టళ్లలో కేర్ టేకర్స్ తొలగింపు
- ఉపాధి కోల్పోయిన 260 మంది
- తక్కువ వేతనంతో పనిచేస్తున్నా కనికరించని పాలకులు
- 15 ఏళ్లుగా సేవలు అందిస్తున్న కేర్ టేకర్స్
- వారి చేసిన పనులన్నీ విద్యార్థులతో చేయించే యత్నం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న కేర్ టేకర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 260 మంది ఉపాధి కోల్పోయారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే 35 మంది కేర్ టేకర్స్ ఉన్నారు. వీరంతా 15 ఏండ్లుగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్నారు. వారిని ప్రభుత్వం మే నెల నుంచి తొలగించడంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఏండ్ల తరబడి విద్యార్థులకు సేవలందిస్తున్న వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. కేర్ టేకర్స్ చేసిన పనులన్నింటినీ ఇకపై విద్యార్థుల చేత చేయించేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్రంలో జీఓ ఎంఎస్ నెంబరు 54 ప్రకారం.. 2014లో 260 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 260 మందిని అసిస్టెంట్ కేర్‌టేకర్స్‌ను తీసుకున్నారు. వారు మొదట రూ.7500 వేతనంతో విధులు నిర్వహించారు. మూడేండ్ల తర్వాత రూ.10900, ఆ తర్వాత మూడేళ్లపాటు రూ.14170 వేతనం ఇచ్చారు. అయితే, 2024 డిసెంబరు నుంచి వారందరి నియామకాలను అట్‌సోర్సింగ్ కిందకు మార్చి.. రూ.13600 వేతనం ఇస్తున్నారు. కేర్ టేకర్స్‌గా పనిచేస్తున్న వీరు ప్రతి రోజూ విద్యార్థులకు రుచికరమైన భోజనం ఏర్పాటు చేయడంతోపాటు పరిసరాల పరిశుభ్రత, గదులు, టాయిలెట్ల క్లీనింగ్, స్టోర్‌లో ఆహారాన్ని భద్రపరచడం వంటి పనులు చేస్తున్నారు. 15 ఏళ్లుగా హాస్టళ్లలో ఆరోగ్యం, ఆహారపరంగా ఏ సమస్య రాకుండా పనిచేస్తున్న వారిని అకారణంగా ప్రభుత్వం మే నెల నుంచి తొలగించింది. ఇకపై వారు చేసిన పనులన్నీ చేయడానికి విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించారు. వాళ్లను ఇద్దరు టీచర్లు గైడ్ చేసేలా నిర్ణయించారు. దీనిపై వివరణ కోసం 'ప్రజాశక్తి' అధికారులను సంప్రదించే యత్నం చేయగా స్పందన కరువైంది.

విద్యార్థులే పరిశుభ్రం చేసుకోవాలా..

కేర్ టేకర్స్ లేకుండా హాస్టళ్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. కేర్ టేకర్స్‌ను తొలగించి.. వారు చేసే పనులన్నీ విద్యార్థుల చేత చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. గదులు, స్టోర్ క్లినింగ్, టాయిలెట్సు పరిశుభ్రత వంటి పనులు విద్యార్థుల చేత చేయించేందుకు కుట్రలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పోటీ ప్రపంచంలో విద్యను పక్కనబెట్టి పరిశుభ్రత పనులు చేసుకుంటూ ఉంటే.. కార్పోరేటు స్థాయిలో ఎలా రాణిస్తారని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విద్యార్థుల బట్టలనే వర్కర్ల చేత ఉతికించాలని కోరుతుంటే.. ఉన్న సిబ్బందిని తొలగించడం సరైందని కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

జీవనం ఎలా కొనసాగాలి?

రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సేవలు అందిస్తున్న కేర్ టేకర్స్‌ను తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారు. హాస్టళ్లలో పని చేస్తున్నందున వారు ఎలాంటి పోటీ పరీక్షలకు కూడా ప్రిపేర్ కాలేదు. ఇప్పుడు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది ఎస్సీ, బీసీ, ఎస్టీలే ఉన్నారు.

మా బతుకుల్లో మట్టికొట్టకండి..
మల్లయ్య, కేర్ టేకర్ కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

నేను ఆరేండ్లుగా కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నాను. వచ్చే జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఉన్నట్టుండి నన్ను కొలువు నుంచి తొలగిస్తే.. ఎలా బతకాలి? నేను ఇతర పోటీ పరీక్షలకు పోలేదు. ప్రభుత్వం దయదలచి తిరిగి ఉపాధి కల్పించాలి.

కేర్‌టేకర్స్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
భీరం హర్షవర్ధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

అరకొర వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కేర్ టేకర్స్‌ను తొలగించి వీధుల్లోకి నెట్టారు. దీంతో 260 మంది ఉపాధి కోల్పోయారు. ఆహారం పరిశుభ్రంగా అందించాలని ఒక వైపు చెబుతూ.. మరోవైపు ఆహారం అందించే కేర్‌టేకర్స్‌ను తొలగిస్తే నాణ్యమైన అహారం ఎలా అందుతుంది? తొలగించిన కేర్ టేకర్స్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.